

# గాంబ్లింగ్

అది ప్రమదావని అనే పేరుగల ఒక లేడీస్ క్లబ్. రకరకాల సభ్యులున్నారు. సరసులు, విరసులు, అరసులు, జీనియస్సులు, ముంగిలాగా వుండేవారూ, అతిగా తాగి వాగేవారు, సలహాలు వుచితంగా పారేసేవారూ, ఫాషన్సు పాటించేవారూ, బులాకీ రాగిదీ, చంద్రవంకా, నత్తు, ముక్కురా, బొడడలు, గూబ్బావిలీలు, చెంపసరాలూ, రెండు కర్ణాభరణాలు యిష్టపడేవారూ, వర్కింగ్ వుమన్, లేజీబోన్స్, నాజూకైన వారూ, కండ పుష్టిగలవారూ, దూరదర్శన్ లో పొద్దున్నే పదినిమిషాలు ఫిట్ అనే వ్యాయామం చూస్తూ తామూ చేసేవారూ, సంగీత విద్వాంసులు, స్టేజ్ యాక్టర్సు గూడా వున్నారు. క్లబ్ కలకలలాడిస్తారు. పేకాట, షటిల్ ఆడతారు. సెక్రటరీ విమల రకరకాల ప్రోగ్రాములు యేర్పాటు చేస్తుంది.

ఒకసభ్యురాలు సెక్రటరీ బల్ల ముందు నిలబడి విన్నవించుకున్నది. ''మీరు మంచి ప్రోగ్రాములు యెన్నికచేసి యేర్పాటు చేస్తున్నారు, మంచి అభిరుచి మీది. నాదొక చిన్న మనవి'' అని చేతులు నలుపుకున్నది.

''యేమిటా మనవి విరజా? సస్పెన్సులో వుంచావే అంతగా వేడుకో అవసరంలేదే? జబర్దస్తీ చేయచ్చు. ఐ డోంట్ మైండ్'' అన్నది విమల. సెక్రటరీ చిఠ్ఠా అవర్జా చూస్తున్నది. పొద్దూకింది యేడుగంటలైంది. దీపాలు కాంతిని విరజిమ్ముతున్నాయి.

''అవుననుకోండి మేడమ్. నేను మిమ్మల్ని స్టడీ చేశాను. మీరు మంచి సరస హృదయంగలవారు'' అన్నదో లేదో, విమల తలెత్తి తీవ్రంగా చూసింది.

''వాట్ డూ యూ మీన్ విరజా? నాకు యెఫేర్సున్నాయంటున్నావా?'' అని మొహం చిట్లించింది. ''సారీ మేడమ్. మిమ్మల్ని నొప్పిద్దామని గాదు నా ఐడియా. కుడియెడమైతే ఫరవాలేదనే మనస్తత్వంగలవారని చెప్పాను. క్షమించాలి'' అని దీనంగా చూసింది విరజ. విమల నవ్వు మొహం పెట్టి, ''క్షమించాను. చెప్పవచ్చు'' అన్నది.

గాంబ్లింగ్ అని ఒక ప్రోగామ్ పెట్టి పందెం వేయమనాలి. వాళ్లకు తోచినంత, తాకత్తును బట్టి పణం పెట్టచ్చు. నేను నవ్వించగలనని చూపుతాను. ఫెయిల్ అయితే రిఫండ్ చేస్తా. ఆటే టైం అక్కర్లేదు. చాప్లిన్ ఒక చిత్రం తీసి ప్రీవ్యూ యిచ్చేవాడట. చిత్రం చూసి నవ్వి కళ్ల వెంట నీళ్లు వస్తే ఆ చిత్రం విజయవంతమౌతుందని ఆయన అభిప్రాయంట. అవసరమైతే ఆ చేర్పులూ, కూర్పులూ చేసి మళ్లా చిత్రాన్ని యింకా బాగా తీసి మళ్లీ చూసేవాడు. అలా చేస్తూ ఖండాంతరాల్లోగూడా ఖ్యాతీ డబ్బూ సంపాయించాడు. నా గాంబ్లింగ్ అనే ప్రోగ్రామ్ చూస్తూ నవ్వీ నవ్వీ నవ్వలేక వెళ్లిపోతే గెలిచానన్నమాట'' అని వినయంగా చెప్పుకున్నది విరజ. సెక్రెటరీ తలెత్తి విరజను చూసింది పరిశీలనగా.

'' ఐ సీ, ఐడియా కొత్తదే కాని డబ్బు ముందే బల్లమీదుంచాలంటే, రిటరన్ చేయాల్సివస్తే యెవరెంత యిచ్చారో యెలా తెలుస్తుందీ?''

'' ఒక కవరుమీద తన పేరూ చిరునామా వ్రాసి, కవర్లో పణం వుంచి కవరు అతికించి బల్లమీదుంచవచ్చు, పొడుగాటి కాగితం గోడ కతికిస్తే పేర్లు వ్రాసి నంబరు వేస్తారు పేరు ముందు. మోసముండదు'' అని వూపిరి పీల్చింది విరజ.

'' ఆల్ రైట్. హాలిడే చూసి యేర్పాటు చేసి సర్క్యులర్ పంపుతా. నీ ప్రోగ్రామ్ విజయవంతమైతే, అటువంటివి మార్చి మార్చి యింకా పెడదాం''

అంటూ లేచి చిత్తా మూసింది సెక్రటరీ.

''థాంక్స్ మేడమ్'' అన్నది విరజ.

2

సెక్రటరీ విమల ప్రమదావనిలో వేదిక మీద నిలబడింది మైక్ ముందు. దూరదర్శిని మీద కనబడే అనౌన్సర్ లాగా హావభావ విలాసాలు చూపుతూ చెప్తున్నది. లైట్లూ, ఫాన్లూ పనిచేస్తున్నాయి. సభికులు, ప్రేక్షకులు కుర్చీలు నింపారు. టైము ఆరున్నర. విమల వెనక, తెర విడిబడాలని కదుల్తున్నది గాలికి.

''మీకు వినోదవుంటేనూ, జూదవుంటేనూ యిష్టతవున్నదని తెలుసుకున్నాను. ఒప్పందం ప్రకారం పణం సంకోచించకుండా పెట్టేశారు. మాయాజూదంలో రెండవ సారి పెట్టినట్టే పెట్టేశారు. ప్రమదావనిలో సాహసులు వున్నారనవచ్చు. కదలకుండా కూర్చుని సభ్యత చూపుతారని ఆశిస్తాను. రిఫ్రెష్‌మెంట్సు అందుతాయి. విసుగెత్తక ముందే ముగుస్తుంది గాంబ్లింగ్. వాయుయానంలో సుందరీమణులు ఆనందమిస్తారు. అలాగే యీ వినోద కార్యక్రమంలోనూ ఫాన్సీ డ్రెస్ వేసుకున్న సుందరులు మీ మధ్యకి రిఫ్రెష్‌మెంట్సు, బండిమీద పెట్టి నెట్టుతూ వస్తారు. పెద్దలకోసం, మిల్క్ షేక్, మజ్జిగ, బాదం పాలు, పప్పుండలు, చల్లని మంచినీళ్లు, వక్క పలుకులు తెస్తారు' అంటున్నది విమల. ఇద్దరమ్మాయిలు ఫాన్సీ డ్రెస్ వేసుకున్నవారొచ్చి మైక్ తీసి కెళ్లారు. విమల వెళ్తుండగానే తెరలు విడివడినాయి.

''మిమ్మల్ని మెప్పించ లేకపోతే పణం వాపసు చేయబడును'' అని వినబడుతుండగా 'బోయ్ మీట్స్ గాళ్' అనే అక్షరాలు మెరిసి మాయమైనాయి.

''కరెంటు ఫెయిలయినా అంతే. మీ ఆశీస్సులతో గెలుస్తాను'' అని వినబడింది. ఫిల్మ్ రన్ కాసాగింది.

నిరంజన్ అర్జంటు పనిమీద కేటీగాడ్‌ని మీట్ గావాలని రాత్రి నిద్రవేళవచ్చి తలుపుతట్టాడు. కొంత జాప్యం అయాక తలుపులు తెరుచుకున్నాయి. యెదురుగా ఎక్స్టైన మెుహంతో గాడ్ నిలబడి కనిపించాడు. ''అంతసేపేంచేస్తున్నావు గాడ్ ఒక్కడివే గదూ వుంటున్నదీ? దొంగ నిద్రా? వెంటనే తలుపు తీయటానికి భయమా, పరువుపోతుందా? లోపలికి పద ముందు. అవతల కొంపలంటుకున్నాయి. నేనే అంటించానని పుకారు పుట్టింది. నన్ను పట్టుకోవాలని వస్తున్నారు. వాళ్ల కళ్లల్లో దుమ్ము కొట్టి సందుగొందులు దూరుతూ తిప్పించుకొచ్చాను'' లోపలికొచ్చి తలుపుగడియపెట్టాడు నిరంజన్.

అది డ్రాయింగ్ రూమ్. లైటు వెలుగుతున్నది. ఇద్దరూ మెత్తలున్న సోఫాల్లో కూలబడ్డారు.

నిరంజన్ భీతితో అన్నాడు. ''గాడ్ నువ్వు నన్ను ఒడ్డున బడేయాలి. మనం గాఢమిత్రులం. సిధియస్ అండ్ థామస్‌లాగా ఒకళ్లకోసం ఒకళ్లం ప్రాణాలిస్తామన్నమాట''.

గాడ్ నిదానంగా అడిగాడు. ''సూటిగా చెప్పు. డొంకతిరుగుడు, ముందుమాటలెందుకు?''

''గుహ్యందదాతి పృచ్ఛతి దదాతి ప్రతిగుణచ్ఛిత'' అన్నట్లు మిత్రుడు తన రహస్యం చెప్పి, మిత్రుని రహస్యం అడిగి తెలుసుకుంటాడు. ''దొంగ నవ్వు నవ్వుతూ, తలవంచి కళ్ళు పైకెత్తి చూస్తూ నవ్వు ఆపేశాడు నిరంజన్.

''నువ్వు తెలుగు ముఖ్యాంశంగా యెమ్మేవని గుర్తుందిలే మిత్రమా అసలు పాయింటు యెత్తు. పీఠికే పెద్దదౌతున్నది'' అన్నాడు గాడ్.

నిరంజన్ అటూ యిటూ తల తిప్పిచూశాడు. ''యేదో చప్పుడౌతున్నది మిత్రమా. రెపరెపలాడుతున్నది. యెలకలున్నాయా? నువ్వలా వున్నావేం?''

కేటీ గాడ్ తలొంచుకుని అడిగాడు ''యెలా వున్నానూ?''

''భోజనం చేస్తూ సగంలో వదిలి చేయి కడుక్కుని వచ్చినట్టున్నావు. రొమాన్సు డిస్టర్బ్ అయితే హర్ట్ అయినట్టున్నావు. జూలియట్‌ని దాచావాయేం రోమియో?'' గాడ్‌ని స్టడీ చేస్తూ అన్నాడు నిరంజన్.

''నీ మోటు సరసానికేంలే. రాక్షసుడు నరవాసన బట్టి అడిగినట్టున్నది. యేదియేమైనా అది నా స్వంత విషయం. యెందుకొచ్చావో చెప్పవాయేం? కొంప అని వాడావు. యేదో ఆపదలో వున్నానన్నావు. నన్ను గురించి దుష్ప్రచారం చేయకు. నీలి వార్తలు సృష్టించకు. నువ్వు నాభరతం పడితే నేనూ నీ భరతం పడతా యీ వూరికావూరెంతో ఆ వూరికీవూరూ అంతే. నువ్వేమీ మచ్చలేని మజ్జిర్‌వి కావు'' అన్నాడు గాడ్.

''నరవాసనే వెూగానీ మిత్రవమా సెంటు వాసనా, వుల్లెవాసనా వస్తున్నాదెటునుంచో, రగిలిపోతున్నట్టున్నది నీ యవారం. అనుమానం పెనుభూతం ఔతుందేమో. టైం నహీ. కట్టె కొట్టె తెచ్చె. సాయపడు. ఓ గాల్ ఫ్రెండ్ తానే యెంకరేజ్ చేసి మిస్‌డ్ ది పీరియడ్ అని నాటుబాంబు విసిరింది నా మీద. మెడికల్‌హెల్పు అందించగల సమర్థుడైన మిత్రుడున్నాడంటున్నానో లేదో, ప్రేమ రెక్కలొచ్చి యెగిరింది. ప్రేమపావురం, ''బ్రూటజ్, బద్మాష్, దగాకోర్ నా

గర్భం వుప్పు బుట్ట అనుకున్నావా ఫలించకపోవటానికీ, పర్టైల్ లాండ్. సరైన వయసు రిప్రొడక్షన్ తెలిసి గర్వించక కూడని టాపిక్ యెత్తుతావా, బ్రూట్ ముష్టివాడివా?'' అని మీటర్ల పైన బంతిలాగా యెగిరింది.

''నువ్వన్నది కాదుగానీ, ప్రాపర్టీ అంతా నగదుతో సహా చారల పెద్దపులి పేర వున్నది. నా జీతంతో మనిద్దరం వేరింటి కాపరం వెలిగించలేము. సరిపెట్టుకోనూలేము. గజనీ గోరీ దండయాత్రలలాగా మీవారూ మా వారూ వచ్చి ఒంటెలమీద ధనరాసులు తిసుకుని వెళ్తారు. నోరూ వాయీ లేని వాళ్లమిద్దరమూ. దండయాత్రలాగే, పెళ్లికీ చదువుకు డబ్బు డిమాండ్ చేసేవారికి లోకువౌతాము. అలా జీవిత సంగ్రామం ముగిసేనాటికి బోసి నోరూ బట్టతలా మిగుల్తాయి దుష్ఫలితాలలాగా. ఏకాకులుగా లైఫ్ లీడ్ చేయుటవే శ్రేయస్కరం''. నా పనస పూర్తికాక ముందే శకుంతలాదేవిలాగా సీను వేసి, యేడ్చిరాగాలెట్టి దుష్యంతుని సభనుండి రివ్వున వెళ్లిన హీరోయిన్ లాగానే వెళ్లిపోయింది ప్రియురాలు. యేదో సవాల్ చేసింది గానీ మిత్రమా సరిగా వినపడలేదు'' అని కన్నీరు కర్చిప్‌తో అద్దుకున్నాడు నిరంజన్.

''పీడ విరగడైందిగా యేడుపెందుకూ? నేనెందుకూ?'' అనడిగాడు కేటిగాడ్.

సోఫాలోంచి కింద కూలబడి భోరుమనేడుస్తూ గాడ్ కాళ్లు చుట్టుకున్నాడు నిరంజన్.

''వదల్లేదు దేవుడా వదల్లేదు'' అని తల అడ్డంగా తిప్పుతూ కంటిన్యూ చేశాడు నిరంజన్. ''వదలకపోగా గాడూ! లాయరు నోటీసందిందివాళే. 'జరగాల్సిందేదో పాడుబడిన గుళ్లో రాతి విగ్రహం యెదుట జరిగిపోయింది.

నీ వంతు భాగం పంచుకుని అది నా కొడుక్కు చెందేట్టు లా ప్రకారం సాక్షి సంతకాలతో సహా దస్తావేజులు వ్రాయించి పంపాలి'. అదీ నోటీసు. అయ్యో దేవుడూ! అలా చేయకపోతే దేవుడూ! స్త్రీ ధనమయేదీ, పురుషుని ఆస్తి అయేదీ మొత్తం లాగేస్తారుట. యెవరూ అడ్డుపడలేరుట. మాన నష్టం దావా వేసి గొప్ప హాస్యగాడు చాప్లిన్ని పెన్నీలెస్ చేసినట్టు చేస్తారట. అతనికి లాగే నాకూ తెల్లారేసరికల్లా జుట్టంతా ముగ్గుబుట్టలాగా అవుతుందిట. తల మీద జుట్టు నల్లగా వుంచుకోదలిస్తే, నోటీసు అందగానే కార్యక్రమం మొదలెట్టాలిట. అయ్యో మిత్రమా! తల్లి బెంగాల్ టైగ్రెస్ అయితే తండ్రి గిర్‌నార్ లయన్. నాకేది దారి? గుడీ లేదు రాతి విగ్రహం లేదు. అదంతా కల్పన. నన్ను గట్టున బడేయి గాడూ!'' అని తలెత్తి చూసి, ''అలా వెలవెలబోతున్నావేం మిత్రమా? నువ్వూ నేనున్న బోటులోకే యెక్కావా?'' అని విలపించాడు నిరంజన్. గుండెబండ చేసుకుని గాడ్, ''మిత్రమా! అలా విలపించరాదు అబలలాగా. నీ అబల వెళ్లి ధైర్యంగా కొడుకును గని పెంచలేదూ! మనం అబలను చూసి నేర్చుకోవాలి. ప్రస్తుతానికి చిట్కా వైద్యం చేద్దాం. కార్యక్రమం మొదలైందని ఒక దొంగ లాయరు ద్వారా జవాబుపంపిద్దాం. బుల్లెట్ ప్రూఫ్ ఆలోచన చేద్దాం. లే. జట్కావాలా చక్రంలో కర్ర దూర్చి టకటకలాడిస్తు వస్తున్నానని సూచన చేస్తున్నాడు. నీ అబల కాళ్ల బేరానికి రావాల్సిందే'' అని లేవదీసి వాకిట్లోకి తీసికెళ్లి యింటి ముందాగిన జట్కాలోకి నెట్టి ''అజీజ్ భాయ్! నిరంజనభాయ్‌ని తీసికెళ్లి నిందాదేవీ హోమ్‌లో అడ్మిట్ చేసి షాక్ తాకి మతిబోయింది తెప్పించాలి'' అని చెప్పి బిల్ పంపమను. ఇందా నీ బిల్'' అని నవ్వాడు గాడ్.

''అచ్ఛా గాడ్ సాబ్'' అని గుఱ్ఱాన్ని దౌడు తీయించాడు అజీజ్.

గాడ్ లోపలికొచ్చి చూస్తే యెదురుగా సోఫాలో తన ప్రియురాలు నీరసించి వెనక్కువాలి కంటబడింది.

''సారీ. వాడెంత సేపటికీ వదిలాడుగాడు. పాపం! బీరువాలో వులెన్ ప్లస్ కాటన్ సూట్ల వెనక గాలి అందక తోటకూర కాడలాగా అయావు'' అని వెళ్లి తలుపు గడియపెట్టి వచ్చి ఫాను వేశాడు. రోజ్‌వాటర్ కలిపిన చల్లని పాలు ఫ్రిజ్‌లోంచి తెచ్చి గ్లాసులో పోసి తాగించాడు. కర్చీఫ్ పెట్టి మొహం తుడిచాడు.

3

కేటీగాడ్ తన ఆరవ ప్రాణాన్ని జనులు విలేజ్ బెల్ అనుకోవాలని ఒక కుగ్రామంలో వూరి చివర యింట్లో ప్రతిష్ఠించి ఒక అర్చకుని నియమించాడు. కాని అడపాదడపా వెళ్లి దర్శించి రావటం యిబ్బంది అయింది. అంతకుముందు ఒక జాబ్‌లో బిగిస్తే తన ఆరవప్రాణానికి అబద్ధాలాడటం, గుంభనగా వుండటం చేతగాదని ఋజువుచేసింది. అడిగిందే తడవుగా సత్యవంతుడి పెళ్లాన్ని అనుకుంటుందేమో, తన గుట్టు రట్టు చేసింది.

''గుడీ లేదు గోపురం లేదు. రాయీ లేదు రప్పా లేదు. పెళ్లీ లేదు పెటాకులూ లేదు. దొరికితే దొంగ. దొరక్కపోతే దొర. అదొక రకం లైఫ్'' అన్నదట. నాగరికురాలు కాదని జాబ్‌లోంచి పీకి తీసికెళ్లాడు. పొద్దుబోక పిల్లల్ని గని పెంచింది ఆరో ప్రాణం. యేదో క్షమాశక్తి చూపించాడు గాడ్. దేవుడు బహుమంచివాడూ దీనులను పాలించువాడూ అని ప్రూవ్ చేశాడు గానీ, ఆమె ఆత్మీయులు ఆమె పంచన చేరారనే వార్త అందక, పిల్లిని పెంచితే మమకారం పెరుగుతుందిట. అలాగా మమకారం పీడించగా, కాళ్ల మోసుకెళ్లగా,

భగవంతుడు భక్తుని కోసం వెళ్లినట్లు వెళ్లాడు.

పిల్లవాడికీ పిల్లకీ కోరింత దగ్గు. జ్వరం. వాంతులు. వాంతి అయినచోట బూడిద చల్లారు. విలేజ్ బెల్ చిక్కి సగమైంది. గచ్చు వరండాల ఆవూ దూడా, ఆవు పంచితం పేడా దర్శనమిచ్చాయి. కిచెన్ చిన్నది. అందులో సగం భాగం యెండు గడ్డి ఆక్రమించింది. ఎలకలు, అత్తగాని అత్త ముక్కుతూ, మూల్గుతూ ననపెడుతూ, టిఫినూ వంటా చేస్తుంది. పాత్రలు క్లీన్ చేయటం బట్టలు వాష్ చేయటం ప్రియురాలి వంతు. ప్రియురాలి అగ్రజుడేమో రాట్నం వడుకుతున్నాడు. నూలు ఆసుపోస్తున్నాడు. సోదరి వేణవూదుతున్నది. రెండో అగ్రజుడు సినిమాహాలులో ఆపరేటర్. పగలు నిద్ర తీస్తాడు. నాలుగోయేడొచ్చిన ఆడ సంతానం కల్లాపీ ముగ్గు పనీ చేస్తున్నది. నడక నేర్చిన కూన కూరకొని చిల్లర యిస్తున్నది.

ఇంటామె వచ్చి తగవు పెట్టుకున్నది.

''నీ చిన్న సంతుతో ఒక్కత్తెవే వుంటావంటే వీడు యిచ్చినానే. ఇంత మంది పోగుబడిరే! వీడు వదిలిపో. ఆవూ దూడా గడ్డీ గాదం గూడానా? పిడకలు చేసి కొడ్తున్నావు. గోడలకూ నేలకు మచ్చలు పడ్డాయి. పోవు. ఫస్టుకల్లా వెళ్లిపోవాల'' చేతులాడిస్తూ నోరు పెద్దది చేసింది. ప్రియురాలు బేలలాగా నిస్సహాయంగా చూసింది.'' ఆవు నాదిగాదమ్మా, నే కొనలేదు. తేవోకు అంటే వినలేదు అన్న. తానున్న పాక ఖాళీ చేసి తెచ్చాడు. చిన్నబిడ్డలకి కోరింత దగ్గు. బళ్లో అంటుకున్నది. మరో యిల్లు చూస్తున్నా వెళ్లిపోతా''. అద్దె యిచ్చి యింటామె చేతిలో పెట్టి దణ్ణం పెట్టింది.

''దారుణం! యిలాగేనా హెల్త్సాఫీసరు ప్రాపకంలో వున్న అబలను ట్రీట్ చేసేదీ'' అన్నాడు గాడ్. ''షేమ్ షేమ్'' అన్నాడు. అత్తగాని అత్త అంటించింది. ''మరి నీకు చచ్చే భయమైపాయె. ఆస్తిలో తనవంతు కోసం దావాలాడుతామని భద్రతలు తీసుకుంటివి. ఇంటి దగ్గర అస్ఖలిత బ్రహ్మచారినని నమ్మబలికితివి. దద్దమ్మకూతురు నీకు వెరవటమేమిటీ? అదేం పాతివ్రత్యం? పసుపుతాడేదీ? జూదమాడనట్టున్నది దాని పెళ్లి. బ్లాక్‌మెయిలింగ్ చేసి రాబట్టటమూ రాదు. దద్దమ్మవి.'' అని తల విసిరి ముక్కు పీక్కుంటూ, రుబ్బిన పిండిని గిన్నెలోకి తోడి పొయ్యి వేపు వెల్లింది.

పిత్రుదినానికల్లే వంట చేసి విస్తట్లోకి తోడితే కివమ్మనకుండా గుటుకుగుటుకు భోక్తలాగా స్వాహా చేశాడు గాడ్. దేవుడు బహుమంచివాడూ దీనులను పాలించువాడు అని కూన పాడుతున్నది.

## 4

రాంబాబు డి.యమ్.వో. మిత్రుడు కేటీగాడ్‌నీ యీ వూరు వేశారని తెలిసింది. మారాడేమో చూతామని వెల్లాడు గాడ్ బంగ్లాకి. హాస్పటాలిటీ ఫస్టుగా వున్నది. భోజనం బాగుంది. ప్యూర్ ఆంధ్రా భోజనం. కాని యేమీ అంతుబట్టక భోజనసమయంలో అన్నివైపులా చూస్తూ యెదురుగా వున్న మిత్రుని అడిగాడు.

''గాడ్ యెవరు వంట చేశారు? యెన్నాళ్లైంది యిటువంటి భోజనం చేసీ! మాకు కుక్ వున్నది. యేదో వండుతుంది. తింటాము. అన్నిటిలో నిప్పు పుల్లలొస్తాయి'' అనడిగాడు నవ్వుతూ. మారు వడ్డన చేస్తున్న విలేజ్ బెల్ వేపు చూశాడు. ఆమె యెటువెళ్తే అటు చూశాడు.

గాడ్ సంశయించకుండా బిడియపడకుండా జవాబిచ్చాడు. కుక్క మెడతిప్పినట్టు తిప్పుతూ వంటింట్లో కెళ్లిపోతున్న బెల్‌ని చూసి బడినించి వచ్చిన చిన్నారులను చూసి,

''తెలిసిన వాళ్లు. ఇబ్బందుల్లో వుండి వస్తే నేను కరుణామయుడినిగాన నా(క్రో జులుండమన్నా. ఆమె పిల్లలూ నా(క్రో జులు కడుపునిండా అన్నం తింటారు. మంచి పోషకాహారం లేకపుల్లలల్లే అయినారు'' అన్నాడు. గాడ్ మీగడ పెరుగు అన్నం తింటున్నాడు.

ఐస్ క్రీమూ, ఫ్రూట్‌సలాడ్ గాజు గిన్నెలు ట్రేలో తెచ్చి దగ్గరగా పెడ్తున్న స్త్రీ సర్వర్ వంక చూశాడు డి.యమ్.వో. రాంబాబు. స్త్రీ సర్వర్ తలెత్తి చూస్తే ప్రశ్నార్థకంగా వున్నదాయన చూపు. తలపంకించి, భావగర్భితంగా నవ్వి పెదిమలు బిగించి నవ్వాపుకుంటూ వెళ్లిపోయిందా స్త్రీ సర్వర్.

డి.యమ్.వో. ఆవులిస్తే ప్రేవులు లెక్కిస్తాడు. ''కేతిగాడల్లే వున్నాడే నాడియర్ బోజం ఫ్రెండు'' అని నవ్వుతూ తీపి అందుకున్నాడు.

''పిల్లలు నీ పోలికే గాడ్! ఫ్రెండ్లీగా వుండటం గూడా నీ స్వభావమే గాడ్! యేదో దాస్తున్నావే. నిజం చెపితే నీ సొమ్మేమైనా పోతుందా? నీ వాళ్ల ఆస్తిపాస్తులు పోతాయా?'' అలా హాస్యమాడుతూ ఐస్‌క్రీమ్, ఫ్రూట్‌సలాడ్ కలిపి తింటూ, ''సర్వర్‌కి అండ దండా స్టేటస్ లేవేమో'' అని నవ్వుకున్నాడు.

5

''శామ్! నాకు సీనియారిటీ ప్రమోషనూ వచ్చి ఆఫీసరు నయాను. గెజెటెడాఫీసర్లూ, విఐపీలూ నాతో పనిబడి వస్తూపోతూ వుంటారు. తగుదునమ్మా

తవ్వాసేరమ్మా అని నువ్వంద రెదుటికి రావోకు. నీ తెలివితేటలు బైటపెట్టకు. టూమచ్ తెలివి. పిల్లల్నీ రానీకు. అన్నట్టు చెప్పటం మరిచా. యు ఆర్ ది క్వీనాఫ్ మై హోమ్ గదూ. నీతో అన్ని విషయాలూ చెప్తూవుంటా. నిన్ను సంప్రదించి నేను చేసిన రెండు పెళ్లిళ్లూ సక్సెస్ అయినాయి. వాళ్లకు యీ యేడు మేల్ బేబీస్ కలిగారు'' అని నడినెత్తిన జుట్టు పీక్కున్నాడు. సంతోషంతో పొంగిపోతున్నాడు. కదిలిపోతున్నాడు గాడ్.

''నువేం చేయాలంటే నీ పిల్లలతో వెళ్లి కొన్నాళ్లు మా యింట్లో వుండి పూసుకుతిరుగుతూ, కలుపుగోలుతనంగా వుండాలి. నీ పిల్లలు బుద్ధిమంతులు. మంచి గ్రేడ్స్ తెచ్చుకుంటున్నారు. నీ పిల్లల్ని చూసి మా పిల్లలు గూడా, ''యీవిడ పిల్లలెంత శ్రద్ధగా చదువుకుంటున్నారో! మనం గూడా చదువుకుందాం'' అని షికార్లు, సిగరెట్లు, సినిమాలు స్నేహితాలు మాని చక్కగా చదువుకుంటారు. నేను పంపానని చెప్పుచ్చు'' టై సర్దుకుని లేసులు బిగించి జాగింగ్ చేస్తున్నట్టు వెళ్లి రన్నవుతున్న మోటారుగల జీపెక్కి వెళ్లిపోయాడు.

చూసిపోదామని వచ్చిన కజిన్ సరస్వతి, కంప్యూటర్ అకాడమీలో చేరి కోర్సు పూర్తిచేసి జాబ్‌లో దూరిన అమ్మాయి, కన్నార్పకుండా చూసింది గాడ్‌ని. పని చేసుకుంటున్న కజిన్ని చూసింది.

''రోజుకో పేరుతో పిలుస్తాడేం గిరిజా అసలుపేరు గుర్తుండదా? ఇతర లేడీ ఫ్రెండ్సు గుర్తు వస్తారా! పిల్లలూ నువ్వూ వాళ్లింటికెళ్లటమేమిటీ! తాగుతాడా యేం? పేరుకు తగ్గట్టున్నది ప్రవర్తన. నిజంగా వెళ్లాలా? కూడా వచ్చి దింపుతాడా?'' అన్నది సరస్వతి.

''దింపడు. ష్యూర్ థింగ్ సరసూ. అదీ చూశా. కూడా వస్తానంటే ''నలుగురూ నవ్వరా?'' అన్నాడు. ''మంచివాడిని గనక సంఘాన్నెదిరించి తెచ్చి దగ్గర పెట్టుకున్నాను. అంతమాత్రాన నీకధికారం రాదు. పడివుండాలంతే. చేయగలిగిన మంచి అంతా చేస్తా. నాకు ద్రోహచింత లేదు. అసహనం అసూయా తగ్గించుకో'' అన్నాడుగాడ్. పూరీలు వత్తుతూ అన్నది గిరిజ.

''మరేం చేయదలచావూ?'' అనడిగింది సరస్వతి వుడికిన బంగాళా దుంపలు చెక్కు తీస్తూ.

''థియేటర్ కెళ్లి సినిమా చూస్తాము. బావుండకపోయినా చివరి వరకూ వుండి చూస్తాము. అన్ని చిత్రాలు బావుంటాయా? గాంబ్లింగ్ హౌస్‌కి వెళ్తాము. గెలిస్తే పొంగిపోతాము. కోల్పోయినా గాంబ్లింగ్ మానము. ఐడెంటిటీ కార్డు యివ్వద్దాయనా? నేనెవరో వాళ్లకు తెలియద్దూ?'' అని నవ్వింది గిరిజ.

''బాగుంది సరసం. ఇంట్లో స్కాచ్ విస్కీ వున్నదేమో చూడాలి. ఆఫీసరైపోయె. వుచితంగా వచ్చిందేమో. సోడా ఐసుముక్కలూ వేసుకోకుండా సేవిస్తాడేమో గాడ్'' తానూ నవ్వింది సరస్వతి.

అలిసిపోయి చిన్న కునుకుతీస్తున్న సమయంలో డ్రాయింగ్ రూమ్‌లో ఫోన్ మోగింది. గిరిజకు మెళుకువ రాలేదు. సరస్వతి లేచి వెళ్లి రిసీవర్ యెత్తింది. '' ఇవాళ కారేజ్ ఆఫీస్‌కి పంపాలి గిరీ! ఇద్దరికి పంపాలి. నా ఫ్రెండ్ వచ్చాడు. ఇక్కడే కానిద్దామన్నాడు''.

''అలాగే సార్. ఇప్పుడే పంపుతాను''.

''పనివత్తిడిలో పొద్దున చెప్పటం మరిచిపోయినా. మీరిద్దరూ

సమర్తపేరంటానికెళ్లాలి. నా సహపుద్యోగి ఫోన్ చేశాడు. వాడు రిటైరై యింటివద్దే వుంటాడు''.

'' ఆడవాళ్లొచ్చి బొట్టుపెట్టి పిలవరూ? ఇవాళ స్నానమా ఆయనేనా సమర్తలాడింది?'' అనడిగింది సరస్వతి నవ్వు అణిచివుంచి.

''అహ. సమర్తలాడింది ఆయన పెద్ద కూతురు. ఆ పిల్లకి తల్లిలేదు. తల్లీదండ్రీ తానే అయి అన్ని వేడుకలు ముచ్చట్లు చేసుకొస్తున్నాడు తల్లిలేని లోటు కనపడకుండా. దోవలోనే యేం ప్రెజెంట్ కొనివ్వాలో కొనుక్కుని వెళ్లాలి. నాకిటువంటి మర్యాదలు తెలియవు''.

''మీరు గూడా వస్తే పికప్ చేసుకెళ్తాం. మగవాడేగా పేరంటం పిలిచింది''.

''నన్ను పిలవలేదు. పిలువని పేరంటమునకు పోవరాదు అని చిన్నప్పుడు కాపీ రాశాను. అంతగా అడిగితే తరవాత వస్తాడని చెప్పచ్చు''.

''అటునించి సూడిదలిచ్చే పేరంటానిక్కూడా వెళ్లిరమ్మన్నారా?''

''సూడిదలంటే యేమిటీ? నేనెప్పుడూ వినలేదు?''

''గాజులు తొడిగించుట, పూలు ముడిపించుటా, పసుపుకుంకుమ యిచ్చుట అని గూడా అంటారు.''

'' ఓహో! యిప్పుడర్థమైంది.''

ఫోన్ డిస్కనెక్ట్ అయింది.

6

''సుజీ! డ్రాయింగ్ రూమ్‌లో వున్నవాళ్లు నీతో మాటాడాలనీ, నిన్ను చూడాలనీ అంటున్నారు ''గాడ్ ఎక్సైటైపోతూ అన్నాడు.

''అందరెదటకీ రావద్దంటిరి గదండీ ! ఇస్త్రీ గుడ్డలొచ్చాయి. చూస్తే బొత్తాలూ, ప్రెస్ బటన్సూ లేవు. కుడుతున్నాను'' అన్నది గిరిజ టైం చూస్తే సాయంత్రం అయిదున్నర అయింది.

''మాటకు మాట జవాబివ్వద్దని యెన్నిసార్లు చెప్పాను? నువ్వు చేసిన నిర్వాకం బాగున్నది. పెళ్లికానేలేదని ప్రాపగండా చేశావుగాబోలు. అదేం జబ్బు? నన్ను న్యూట్రల్ జెండరని చెప్పుకుంటున్నారు. భార్యపిల్లలూ వున్నారని ఋజువుచేయాలి నేను. గుళ్లో పెళ్లి చేసుకున్నామనో దండలు మార్చుకున్నామనో చెప్పచ్చుగా? మాయ గొలుసు నల్లపూసలున్నవి పెండెంటున్నదీ వేసుకోవచ్చునే?''

''వేదకాలంలో అవేం లేవంటిరి. మెడ నల్లబడుతుందంటిరి?'' లేవదీయబోయాడు గాడ్. లేచి తప్పించుకున్నది గిరిజ. వడేసిపట్టి లాక్కెళ్లాడు డ్రాయింగ్ రూమ్‌లోకి.

కుర్చీల్లో వున్న వాళ్లు లేచారు.

''నమస్తే మేడం! మిమ్మల్ని లేడీస్ క్లబ్బులోనూ రెడ్‌క్రాస్ లోనూ మెంబరుగా చేర్చాలని వచ్చాము. మీరు గాడ్ ఆఫీసర్ భార్యగా సోషల్ వర్క్ చేయాలి. గవర్నరు గారి భార్యా, విసి గారి భార్య, సియంగారి భార్యా లాంటి పెద్దలొస్తారు స్వాగతం పలకాలి పూలదండ వేయాలి'' అని కూర్చున్నారు.

మరొకామె లేచి చెప్పింది. ''పిల్లలకీ, టీనేజర్సుకీ పోటీలు జరుపుతాము. మీ పిల్లల్ని ప్రోత్సహించి పంపాలి. చిత్రలేఖనం, నాట్యం, సంగీతం, లలిత సంగీతం, అభినయం, ఆటలపోటీలు, వక్తృత్వ పోటీలు జరుపుతాము. ముందే తెలియజేస్తాము. పంపండి పిల్లల్ని'' అని కూచున్నది.

''థాంక్స్. స్వాగతం యెలా పలకాలో రాసివ్వండి పలుకుతాను. నాచేతనైనట్టు పలికితే, ఆఫీసరుగారు '' అలాగాదు పలికేది '' అంటారు. ష్యూర్‌థింగ్. టైం, వారం చెపితే వచ్చి నా విధులు నెరవేరుస్తాను. తెలియక తలదూరిస్తే అన్నిటిలో కలగజేసుకోకు అంటారు ఆఫీసరుగారు. ఒక వాహనం ఒక మనిషినీ పంపితే మరీ మంచిది. గవర్నమెంటు వాహనాల్లో నీ స్వంత పన్లమీద వూరేగద్దు. నా మీదికి కేసు వస్తుంది. బాడ్ రిపోర్టు వ్రాస్తారు. నీ మూలకంగా నేను జైలుకెళ్లాలా అంటారు ఆఫీసరుగారు'' అన్నది.

''థాంక్స్ మేడం. మంచి డిసిప్లిన్ పొందినట్టు చూచాగా చెప్పారు. తప్పకుండా డైలాగ్సు వ్రాసి తెచ్చిస్తాము. మేము కేటీగాడ్ ఆఫీసరుగార్ని సంప్రదించాలి. మేమే వచ్చి మా ప్రైవేట్ కార్లో తీసి కెళ్తాము. వీడియో ఫిల్మ్ తీస్తారు. మీకు యిబ్బంది వుండదు. గాడ్ ఆఫీసరుగారు వర్రీ అయ్యే అవసరముండదు. యిది డీసెన్సీ చూపిందో లేదో డబ్బు కానుకలు నిరసించిందో లేదో అని మథనపడకండి వీడియో ఫిల్మ్ దూరదర్శిని మీద చూపిస్తాము. ప్రైవేట్ ఛానలున్నది'' అని నవ్వుతూ నమస్తే చెప్పి వెళ్లిపోయారు.

## 7

డ్రాయింగ్ రూమ్‌లోంచి సుడిగాలిలాగ వచ్చాడు గాడ్.

''గిరిజా! ఆఫీసర్లు, వారి భార్యలూ, మా వాళ్లూ నువ్వు టీ టిఫిన్లు చాలా రుచిగా చేస్తావని మెచ్చుకున్నారు. త్వరగా ఒక డజన్ కప్పుల టీ, ప్లేట్లలో టిఫిన్ పెట్టి తీసుకురా. మేము అఫిషియల్ విషయాలు మాట్లాడుకుంటున్నాము. సరిగ్గా టీ వేళ. నాలుగున్నరయింది. ఇవాళ ఫ్యూన్ రాలేదు. పాపం. వాడిని మలేరియా యెటాక్ చేసిందట. వాడి ఆలి పుట్టింటికి పూడ్సి వారమైందట. నీ కజిన్ సరస్వతి వచ్చినట్టున్నదే నన్ను ఆటలు పట్టించటానికీ! ఫర్వాలేదు. యిద్దరూ తీసుకురండి గబగబా చేయాలి పకోడీలు'' అని నడినెత్తిన జుట్టుపీక్కుంటూ డ్రాయింగ్ రూమ్‌లోకి వెళ్లిపోయాడాఫీసర్ గాడ్.

సరస్వతి గిరిజ వంక చూసింది. ''యెప్పుడెళ్లా వాళ్లింటికి? మైలపడలా వాళ్లందరూ? కులం పోలేదూ? తలెత్తుకు తిరిగారూ, కూడా వచ్చాడా కేటీగాడ్ ఆఫీసరూ? జుట్టు పీక్కుంటాడెందుకూ? కాలాడిస్తాడెందుకూ? కదిలిపోతాడేం? గూళ్లు తిప్పుతూ పోతాడు?''

గిరిజ నవ్వుతూ టీ పోస్తూ అన్నది ''ఛిప్సూ, పకోడీలూ, ప్లేట్లలో పెట్టు. మంచినీళ్లు అయిస్ వాటర్ సీసాలు. బట్టతల కాకుండా జుట్టు పీక్కుంటాడట. స్లైట్‌గా పార్కిన్‌సన్ డిసీజ్ వల్ల కదిలిపోతాడు. బుజాలు తిప్పటం తల్లి పోలికేమో మనకెందుకూ? కాలాడిస్తే ఖుషీగా వున్నాడన్నమాట'' అంటూండగా యిద్దరు లేడీ యైస్సైలు లోపలికొచ్చారు.

''నమస్తే మిసెస్ గాడ్. నా పేరు మిసెస్ అనితా నిరంజన్. గాడ్‌గారు నేను క్రైసిస్‌లో వుండగా సింపతీ చూపి, ఐపియస్ పరీక్షకు అప్పియర్ కమ్మని బాగా ప్రోత్సాహమిచ్చి సాయపడ్డారు. యస్సైగా సెలెక్టు అయేట్టు చూశారు. ''మీరేం బాగా సంపాయించుకోవచ్చు, యెవరి ఆస్తిలో వాటా అడగక్కర్లేదు'' అని

నవ్వారు. నా మారేజ్ రాళ్లమీదున్నప్పుడు స్మూద్‌గా వున్న మార్గం చూపారు. నిరంజన్‌గారు గాడ్‌గారు తోడుదొంగలనుకోండి. ఉచితంగా ఫెయిత్‌ఫుల్ దాసి కావాలి. ఈమె నా ఫ్రెండ్ శారద. మరొక రకం లైఫ్ చూశారు. హెర్ మారేజ్ ఆల్సో వస్ ఆన్ రాక్స్. నేనామెకు సాయపడ్డాను. ట్రేయిటివ్వండి మేమే తీసికెళ్తాము'' అన్నారు. ''మారేజ్ అనేది గాంబ్లింగే'' అన్నది అనితా నిరంజన్.

కాని నలుగురు నాలుగు ట్రేలతో డ్రాయింగ్ రూమ్‌లో కెళ్లేప్పటికే అందరూ జుట్టు పీక్కుంటూ, గూళ్లు కదిలించుకుంటూ పెద్దగా నవ్వుతూ వెళ్లి జీపుల్లో దూరారు. కదిలిపోయినై.

వీళ్ల నలుగురు ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. గిరిజ ఆలస్యం చేయకుండా యీగిల్ ఫ్లాస్కులు తెచ్చింది. ప్లాస్టిక్ బుట్ట తెచ్చింది. ఫ్లాస్కులో టీ పోశారు. గుండ్రని ఫ్లాస్కుల్లో టిఫిన్ సర్దారు. ప్లేట్లూ గ్లాసులూ కప్పులూ కడిగి బుట్టలో సర్ది టవల్ కప్పారు.

వాకిట్లో యింకొక జీపు నిలబడివున్నది.

''థాంక్స్ మేడం. సమయస్ఫూర్తి వున్నది మీకు. ఆఫీసులో అమర్చి తినిపించి తాగిస్తాం. ఐస్ వాటరున్నది కూడా, నమస్తే'' అని ఫ్లాస్కులు బుట్టా అందుకొని వెళ్లి జీపెక్కి చెయ్యి వూపారు. జీప్ వెళ్లిపోయింది.

8

విమలా, విరజా వేదికమీద కొచ్చారు. అందరూ నవ్వుతూ కళ్లు అద్దుకుంటూ మొహం అద్దుకుంటూ క్లబ్ హాల్ వదులుతున్నారు.

విరజ దణ్ణం పెడుతూ అడిగింది.

''యెవరికన్నా పణం రిఫండ్ చేయాలా, నో అబ్జెక్షన్. చేస్తాను.''

''అక్కర్లేదు విరజా. ఎంజాయ్ చేశాము. రుచి అయిన రిఫ్రెష్‌మెంట్సు ఆరగించాము. మరో ప్రోగ్రాం అరేంజ్ చేయాలి'' అని వెళ్లిపోయారు బయటికి.

9

తీరిగ్గా కూచుని యిద్దరూ కవర్లు వూడదీసి లెక్క చూశారు.

'' ఈ డబ్బుతో యేం చేద్దామంటావు గాంబ్లర్!'' అనడిగింది సెక్రెటరీ విమల.

''గోడలు మాసినై. పెయింట్ వేయిద్దాం. ఫర్నిచర్ పాడైంది. బాగు చేయిద్దాము. టైల్స్ మాసాయి. మెరిసేట్టు చాక్‌పౌడర్‌తో రుద్దిద్దాము. కొత్త క్రోకరీ కొందాము. యింత గెలుస్తానని నేను వూహించలేదు మేడమ్'' అన్నది విరజ.

''థాంక్స్ నాకంత పెద్ద ఆలోచన రాలేదు విరజా. గాంబ్లింగ్ సక్సెస్ అయింది. మళ్లా సెక్రెటరీ యెన్నికలొస్తున్నాయి. నువ్వు స్టాండ్ గావాలి'' అన్నది విమల.